31వ వసంతంలోకి
చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా
ఆదివారం, నవంబర్ 15 , 2026
పేజీలు : 8

బాలల భద్రత అందరి బాధ్యత

- సమస్యలు ఎదురైతే భయపడొద్దు..
- అధికారులకు చెప్పండి
- బాలల దినోత్సవ వేడుకల్లో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



చురకలు ప్రతినిధి కరీంనగర్ : బాలల భద్రత, సంక్షేమానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. పిల్లలు తమ హక్కులు, రక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా భయపడకుండా సంబంధిత అధికా రులకు తెలియజేయాలని అన్నారు. బాలలకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతోపాటు వారి ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి అధ్యక్షతన శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే చిన్నారులకు పలు సూచనలు చేశారు. అనంతరం -మిగతా 2లో

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

- పేద కుటుంబాలకు ఆర్థిక రక్షణ కవచంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం
- దేశంలోనే వినూత్న సంక్షేమ కార్యక్రమానికి తెలంగాణ ప్రజా ప్రభుత్వం శ్రీకారం
- నవంబర్ 19న ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- జగిత్యాల జిల్లాలో సుమారు 2.85 లక్షల కుటుంబాలకు ఆర్థిక లబ్ధి చేకూరేలా కార్యాచరణ
- అర్హుల గుర్తింపు, పారదర్శక నమోదు ప్రక్రియ పై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టి



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 14 : జగిత్యాల జిల్లాలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కుటుంబానికి ఆధారంగా నిలిచే కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా అండగా నిలిచేందుకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంను



ప్రవేశపెడుతోంది. కుటుంబ పెద్దను కోల్పోయిన విషాద సమయంలో ఆ కుటుంబం జీవనోపాధి కోసం ఇతరులపై ఆధారపడకుండా, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ప్రతి కుటుంబానికి భరోసా కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం రూపొందించిన ఈ పథకం రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలకు భవిష్యత్తుపై నమ్మకాన్ని కల్పించనుంది. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు.రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా రక్షణ కల్పించే దిశగా చేపట్టిన ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కుటుంబానికి అండగా ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా భరోసా... సాధారణంగా కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనారోగ్యం, ప్రమాదం లేదా ఇతర కారణాలతో మరణిస్తే ఆ కుటుంబం ఒక్కసారిగా అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా పేద కుటుంబాల్లో కుటుంబ పెద్ద మరణం ఆర్థికంగా తీవ్ర ప్రభావం చూపుతుంది. పిల్లల చదువులు, కుటుంబ సభ్యుల పోషణ, గృహ అవసరాలు, అప్పుల చెల్లింపులు వంటి బాధ్యతలు భారంగా మారుతాయి. రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవించే కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక భరోసా కల్పించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. కుటుంబానికి సంపాదన అందించే వ్యక్తి మరణించిన సందర్భంలో రూ.5 లక్షల బీమా మొత్తం అందించడం ద్వారా ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం కల్పించనుంది. కుటుంబంలో సంపాదించే వ్యక్తి ప్రాణానికి ఆర్థిక భద్రత కల్పించడమే దీని వెనుక ఉన్న ప్రధాన ఆశయం.

కుల మతాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి ఈ అవకాశం.. ఈ పథకంలో కులం, మతం, ఆదాయం వంటి భేదాలు లేకుండా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి బీమా రక్షణ కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కుటుంబంలో ఉపాధి పొందుతూ కుటుంబ పోషణకు తోడ్పడుతున్న అర్హత కలిగిన వ్యక్తికి ఈ జీవిత బీమా వర్తిస్తుంది. 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన కుటుంబ సంపాదన సభ్యుడిని బీమా పరిధిలోకి తీసుకోనున్నారు. అర్హత కలిగిన కుటుంబాలు తమకు అనుకూలమైన వ్యక్తిని బీమా కోసం ఎంపిక చేసుకునే అవకాశం ఆయనపై ఆధారపడిన కుటుంబ సభ్యుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడం ఈ పథకం ప్రత్యేకత. కష్టకాలంలో ప్రభుత్వం తమకు అండగా ఉంటుందనే నమ్మకాన్ని పేద కుటుంబాల్లో కల్పించడమే దీని వెనుక ఉన్న ప్రధాన ఆశయం.

కుల మతాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి ఈ అవకాశం.. ఈ పథకంలో కులం, మతం, ఆదాయం వంటి భేదాలు లేకుండా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి బీమా రక్షణ కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కుటుంబంలో ఉపాధి పొందుతూ కుటుంబ పోషణకు తోడ్పడుతున్న అర్హత కలిగిన వ్యక్తికి ఈ జీవిత బీమా వర్తిస్తుంది. 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన కుటుంబ సంపాదన సభ్యుడిని బీమా పరిధిలోకి తీసుకోనున్నారు. అర్హత కలిగిన కుటుంబాలు తమకు అనుకూలమైన వ్యక్తిని బీమా కోసం ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఒక కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నట్లయితే, వారిలో ఎవరికి జీవిత బీమా రక్షణ కల్పించాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చు. తద్వారా ప్రతి కుటుంబానికి తమ పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకునే వెసులుబాటు ఉంటుంది.కుటుంబంలో -2లో

విద్యతోనే వికాసం సాధ్యం

- పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి
- జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 14: విద్యతోనే వికాసం సాధ్యమని, పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో శనివారం భారత మాజీ ప్రధానమంత్రి పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల విజ్ఞాన వికాసానికి ఎంతో దోహదపడతాయని, పాఠ్యపుస్తకాలతో పాటు వివిధ విజ్ఞాన సంబంధిత పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలని సూచించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎస్సీ, బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి చేయడం జరిగిందని, గతంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న లైబ్రరీ విద్యార్థుల కోరిక మేరకు భోజన వసతి కల్పించడం జరిగిందని తెలిపారు. 1 కోటి రూపాయలతో లైబ్రరీ భవనం మంజూరు చేసి దాదాపు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని, గురుకుల పాఠశాలల్లో వసతులు లేక 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేసి పనులు ప్రారంభించడం జరిగిందని చెప్పారు. జిల్లా కేంద్రంలో లైబ్రరీ ప్రారంభానికి లైబ్రరీ చైర్మన్ చొరవ చూపాలని సూచించారు. -మిగతా 2లో

మెట్‌పల్లిలో మెగా జాబ్ మేళా

- 750 మందికి ఉద్యోగ అవకాశాలు.!
- 1,500 మందికి పైగా నిరుద్యోగ యువత హాజరు
- యువత భవిష్యత్తుకు భరోసా కల్పించడమే లక్ష్యం
- కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్



చురకలు విలేకరి, మెట్‌పల్లి, నవంబర్ 14: కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో మెట్‌పల్లిలోని వెంకట్ రెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ మేళాకు 1,500 మందికి పైగా నిరుద్యోగ యువత, విద్యార్థులు హాజరుకాగా, సుమారు 750 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం -మిగతా 2లో

విద్యతోనే వికాసం సాధ్యం

మొదటి పేజీ తరువాయి... గ్రంథాలయాల అభివృద్ధికి తన వంతుగా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా లైబ్రరీ చైర్మన్ సంఘనబట్ల దినేష్, డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, పీఏసీఎస్ చైర్మన్లు దామోదర్ రావు, నవీన్ రావు, కౌన్సిలర్ మమత, రామకృష్ణ రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి శంకరయ్య, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, సమీండ్ల శ్రీనివాస్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు సతీష్, మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, జిల్లా యూత్ అధ్యక్షులు బీరం రాజేష్, సేవాదళ్ రాష్ట్ర సెక్రటరీ ముకేష్ ఖన్నా, సీనియర్ నాయకులు బండ భాస్కర్, రాచకొండ శ్రీరాములు, రేపల్లె హరికృష్ణ, కౌన్సిలర్లు చెట్టే గంగాధర్, పిట్ట ధర్మరాజు, చెట్టే గంగాధర్ కూతురు రాజేష్, అఫ్రోజ్, జుంబర్తి రాజ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుసరి అనిల్, మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం, యూత్ నాయకులు శరత్ భార్గవ్, అంకం సతీష్, వెంకన్న, ప్రసాద్, జగన్, ఈశ్వర్, శేఖర్ రాజు, రమేష్, నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలల భద్రత అందరి బాధ్యత

మొదటి పేజీ తరువాయి... పాలకుటీర్ సంక్షేమ ట్రస్టు ఆధ్వర్యంలోని చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్‌కు మరో ఐదేళ్లపాటు గుర్తింపు పొడిగింపు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. సంస్థ నిర్వహణ, పనితీరు, చిన్నారులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా భేటీ జన్మోత్సవ్ కిట్లను అందించారు.

ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు...

కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. మ్యాజిక్ షో పిల్లలను విశేషంగా అలరించింది. చిన్నారులు ఉత్సాహంగా వేదుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, కమిటీ సభ్యులు, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ తిరుపతిరావు, డీసీపీఓ పర్వీన్, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో మెగా జాబ్ మేళా

మొదటి పేజీ తరువాయి... సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా స్థానికంగానే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి యువతకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ యువత భవిష్యత్తుకు భరోసా కల్పించేలా భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ తెలిపారు.

కన్నాలలో బాల గ్రామసభ

చురకలు పెద్దపల్లి జిల్లా ప్రతినిధి కమాన్‌పూర్ నవంబర్ 14 : మంథని మండలం కన్నాల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాల గ్రామ సభ గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో బాల్య వివాహాలు జరగకుండా అరికట్టాలని గ్రామంలోని ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకొని బాల్యవివాహాలు జరగకుండా నిరోధించాలని ఈ సందర్భంగా గ్రామ ప్రజలను కోరారు.పిల్లలు ఎదుగుదలకు పిల్లలకు తోడ్పడే పోషకాహారం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంగన్వాడికి సూచించడం జరిగింది. పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని ఆశ వర్కర్‌కు సూచించడం జరిగింది. మరియు యువత గంజాయి బారిన పడకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కీర్తన ముసుకుల కృష్ణవేణి చంద్ర పద్మ రామగిరి సంపత్ పంచాయతీ కార్యదర్శి కేశెట్టి మధుకర్ అంగన్వాడీ టీచర్లు ఆశ వర్కర్ మహిళ గ్రూపు సభ్యులు గ్రామస్తులు సుధాకర్ సదయ్య రాములు అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అల్లం బుచ్చమ్మ కుటుంబానికి సాహితీవేత్తల పరామర్శ

చురకలు ప్రతినిధి మంథని,నవంబర్ 14 : ఇటీవల మృతి చెందిన అల్లం బుచ్చమ్మ కుటుంబ సభ్యులను పలువురు కవులు, రచయితలు, సాహితీవేత్తలు శనివారం మంథని మండలం గాజులపల్లిలో పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బుచ్చమ్మ కుమారులు అల్లం రాజయ్య, అల్లం వీరయ్యతో పాటు ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణను కూతురు కుదిరే లక్ష్మి లను కలిసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.అనంతరం అల్లం బుచ్చమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మృతిపట్ల విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.పరామర్శించిన వారిలో కవులు,రచయితలు, సాహితీవేత్తలు,కళాకారులు ,సామాజిక కార్యకర్తలు ఏలేశ్వరం వెంకటేశం,పుట్ట రాజన్న,మందల రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

మొదటి పేజీ తరువాయి... ప్రధానంగా ఆదాయం సంపాదించే వ్యక్తి ఎవరు? ఆయనపై ఎంతమంది ఆధారపడి ఉన్నారు? కుటుంబ పోషణలో ఎవరి పాత్ర కీలకంగా ఉంది? వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని బీమా కోసం వ్యక్తిని ఎంపిక చేసుకోవచ్చు.

నామినీ ఎంపికలో కుటుంబ సభ్యులకే స్వేచ్ఛ...

ఈ పథకంలో మరో ముఖ్యమైన అంశం నామినీ ఎంపిక. బీమా పొందే వ్యక్తి తన కుటుంబ సభ్యుల్లో ఒకరిని లేదా పలువురిని నామినీలుగా ఎంపిక చేసుకునే అవకాశం ఉంది.

అంతేకాకుండా, బీమా మొత్తం రూ.5 లక్షలను నామినీలకు ఏ నిష్పత్తిలో పంపిణీ చేయాలనే విషయాన్ని కూడా కుటుంబ సభ్యులే నిర్ణయించుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకున్న సందర్భంలో ప్రతి ఒక్కరికీ ఎంత మొత్తాన్ని కేటాయించాలనే వివరాలను కూడా నమోదు చేసుకోవచ్చు. దీనివల్ల బీమా మొత్తం పంపిణీ విషయంలో కుటుంబ సభ్యుల అభిప్రాయానికి ప్రాధాన్యత ఉంటుంది. నామినీ వివరాలు నమోదు చేసే సమయంలో పేర్లు, సంబంధాలు, ఆధార్ వివరాలు, బీమా పొందే వ్యక్తి ఎంపిక, నామినీల వాటాల వివరాలను సరిచూసుకోవడం కీలకం కానుంది.

ఆధార్ కార్డుల ఆధారంగా అర్హుల గుర్తింపు..

పథకానికి అర్హులైన వారిని గుర్తించేందుకు ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హుల వివరాలను సేకరించనున్నారు. నమోదు ప్రక్రియలో ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. కుటుంబంలో ఉపాధి పొందుతున్న వ్యక్తుల వివరాలు, బీమా కోసం ఎంపిక చేసిన వ్యక్తి వివరాలు, నామినీల వివరాలను నమోదు చేయనున్నారు. ఆధార్ కార్డులోని పుట్టిన తేదీ ఆధారంగా వయస్సును నిర్ధారించడం వల్ల అర్హత కలిగిన వ్యక్తుల ఎంపికలో స్పష్టత ఉంటుంది.

వివరాల నమోదు సమయంలో ఆధార్‌లోని సమాచారానికి, దరఖాస్తులో పొందుపరిచిన వివరాలకు మధ్య వ్యత్యాసాలు లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుంది.

నవంబర్ 14 నుంచి 18 వరకు విస్తృత ప్రచారం....

పథకం ప్రారంభానికి ముందుగానే ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను చేపడుతోంది. నవంబర్ 14 నుంచి 18 వరకు గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డప్పు చాటింపు, దండోరా ద్వారా ప్రతి ఇంటికి పథకం వివరాలను చేరవేయనున్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రజలకు పథకం ఉద్దేశం, అర్హతలు, వయస్సు పరిమితి, బీమా మొత్తం, నామినీ ఎంపిక, నమోదు విధానం వంటి అంశాలపై వివరించనున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించాల్సి ఉంటుంది. ముఖ్యంగా పథకాలపై అవగాహన తక్కువగా ఉన్న గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ఆవాసాలు, పట్టణాల్లోని పేద కుటుంబాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

జిల్లాలో నవంబర్ 19 నుంచి ప్రత్యేక నమోదు కేంద్రాలు....

నవంబర్ 19న పథకం ప్రారంభమైన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రాల ద్వారా అర్హులైన కుటుంబాల నుంచి వివరాలు సేకరించి నమోదు ప్రక్రియ చేపట్టనున్నారు. ప్రతి కుటుంబానికి ఈ పథకం ప్రయోజనం అందేలా విస్తృత స్థాయిలో నమోదు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ స్థాయిలో, పట్టణ ప్రాంతాల్లో సంబంధిత మున్సిపల్ యంత్రాంగం ఆధ్వర్యంలో సమన్వయంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లనున్నారు. ప్రజలు నమోదు కేంద్రాలకు వచ్చినప్పుడు వారికి అవసరమైన సమాచారం అందించడంతో పాటు, దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేయడం అధికారుల బాధ్యతగా ఉంటుంది. కుటుంబ సభ్యులు ఎంచుకున్న బీమా పొందే వ్యక్తి వివరాలు, నామినీ వివరాలు, పంపిణీ నిష్పత్తి వంటి అంశాలను జాగ్రత్తగా నమోదు చేయాల్సి ఉంటుంది. నమోదు పూర్తయిన తర్వాత వివరాలను మరోసారి పరిశీలించడం ద్వారా భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా చూడవచ్చు.

వివరాలు డిజిటల్ విధానం లో పారదర్శక నమోదు....

ఈ పథకంలో నమోదు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం డిజిటల్ విధానానికి ప్రాధాన్యత ఇస్తోంది. దరఖాస్తుల స్వీకరణ నుంచి నామినీ వివరాల నమోదు వరకు ప్రతి అంశాన్ని జాగ్రత్తగా నమోదు చేయాలని అధికారులకు సూచించింది. కుటుంబ సభ్యులు అందించిన సమాచారాన్ని సంబంధిత డిజిటల్ వ్యవస్థలో నమోదు చేసే సమయంలో ఎలాంటి తప్పులు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఒకే కుటుంబానికి సంబంధించిన వివరాలు మరో కుటుంబంతో కలవకుండా, అర్హులైన వ్యక్తి ఎంపికలో పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలి.

దరఖాస్తు నమోదు పూర్తయిన తర్వాత అందులో పొందుపరిచిన వివరాలను సంబంధిత కుటుంబ సభ్యులకు చదివి వినిపించాలి. వారు ఎంపిక చేసుకున్న వ్యక్తి వివరాలు, నామినీల పేర్లు, బీమా మొత్తం పంపిణీ నిష్పత్తి తదితర అంశాలను మరోసారి ధ్రువీకరించుకోవాలి.

కుటుంబ సభ్యుల అంగీకారం తీసుకున్న తర్వాతే నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ విధానం వల్ల తప్పులు, అపోహలు, భవిష్యత్తులో తలెత్తే వివాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుంది.

జగిత్యాల జిల్లాలో సుమారు 2.85 లక్షల కుటుంబాలకు జీవిత బీమా భరోసా.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జగిత్యాల జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మొత్తం 2,83,458 కుటుంబాలకు పథకం వివరాలు చేరేలా కార్యాచరణ రూపొందించారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో 385 గ్రామ పంచాయతీల ద్వారా 2,01,038 కుటుంబాలకు, ఐదు మున్సిపాలిటీల పరిధిలోని 136 వార్డుల ద్వారా 82,420 కుటుంబాలకు పథకంపై అవగాహన కల్పించనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలను కలిపి మొత్తం 521 గ్రామ పంచాయతీలు, వార్డుల పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబర్ 14 నుంచి 18 వరకు విస్తృత ప్రచారం నిర్వహించి ప్రతి కుటుంబానికి పథకం వివరాలు తెలియజేయనున్నారు. నవంబర్ 19 నుంచి ప్రత్యేక నమోదు కేంద్రాల ద్వారా అర్హులైన కుటుంబాల వివరాలను సేకరించనున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ అర్హుల గుర్తింపు, వివరాల నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించనున్నారు.

పేద కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలిచే గొప్ప సామాజిక భద్రతా కార్యక్రమం...

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రాముఖ్యతను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ వివరిస్తూ, కుటుంబాన్ని పోషించే వ్యక్తికి అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో పిల్లల చదువులు, కుటుంబ పోషణ, ఇతర అత్యవసర అవసరాలకు ఈ బీమా మొత్తం ఆర్థికంగా తోడ్పడుతుందని తెలిపారు. కులమతాలకు అతీతంగా అర్హులైన కుటుంబాలకు బీమా భద్రత కల్పించాలనే ప్రభుత్వ సంకల్పం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా పథకం అమలులో ప్రతి అర్హ కుటుంబానికి సమాచారం చేరడం అత్యంత ముఖ్యమని, ఆధార్‌లోని పుట్టిన తేదీ ఆధారంగా అర్హుల వయస్సును నిర్ధారించాలని అధికారులకు సూచించారు. బీమా కోసం ఎంపిక చేసిన వ్యక్తి వివరాలు, నామినీల పేర్లు, వారికి కేటాయించే బీమా మొత్తం వాటాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని ఆదేశించారు.

నమోదు పూర్తయిన తర్వాత కుటుంబ సభ్యులకు వివరాలను మరోసారి చదివి వినిపించి, వారి అంగీకారంతో ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యం క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

పేద కుటుంబాల భవిష్యత్తు పై నమ్మకం...

సాధారణంగా జీవిత బీమా పొందాలంటే వ్యక్తిగతంగా పాలసీలు తీసుకోవడం, ప్రీమియం చెల్లించడం వంటి ప్రక్రియలు ఉంటాయి. అయితే ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించాలనే ప్రభుత్వ సంకల్పంలో భాగంగా ఈ పథకాన్ని రూపొందించడం విశేషం. కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు రూ.5 లక్షల బీమా మొత్తం ఆ కుటుంబానికి ఆర్థిక ఆసరాగా నిలవనుంది. పిల్లల చదువులు, కుటుంబ పోషణ, ఇతర అత్యవసర అవసరాలను కొంతవరకు తీర్చుకునేందుకు ఈ మొత్తం ఉపయోగపడుతుంది.కుటుంబ పెద్దను కోల్పోయిన బాధను ఏ ఆర్థిక సహాయం భర్తీ చేయలేకపోయినా, ఆ సమయంలో కుటుంబం పూర్తిగా ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లకుండా నిలబెట్టేందుకు ఈ పథకం తోడ్పడనుంది.ముఖ్యంగా అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులు, రోజువారీ కూలీలు, చిన్నచిన్న ఉపాధి పనుల ద్వారా కుటుంబాలను పోషించుకునే వారికి ఈ తరహా సామాజిక భద్రత ఎంతో అవసరం.

సంక్షేమంతో పాటు సామాజిక భద్రత కు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత..

ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు కేవలం తక్షణ ఆర్థిక ప్రయోజనాలకే పరిమితం కాకుండా, ప్రజల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ఉండాలి. ఈ దిశగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఒక కీలక అడుగుగా నిలవనుంది. కుటుంబంలోని సంపాదనపరుడి జీవితానికి బీమా రక్షణ కల్పించడం ద్వారా ఆయనపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఆర్థిక భద్రత కల్పించాలన్నది ఈ పథకం ప్రధాన ఆలోచన.

యాదవ సంఘ భవనానికి రూ.3లక్షలు మంజూరు



చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 14 : జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామ యాదవ సంఘం భవన నిర్మాణానికి మంజూరైన రూ.3 లక్షల నిధులు మంజూరయ్యాయి.శనివారం జగిత్యాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంతర్గాం యాదవ సంఘం సభ్యులకు ప్రొసీడింగ్ కాపీని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అందించారు.నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాల ముకుందం,మాజీ సర్పంచ్ నారాయణ, ఏలూరి శ్రీనివాస్, సాయి శేఖర్,ఆదరణ తిరుపతి, మారవేణి మల్లయ్య,సాయి కొమురయ్య, ఏఎంసీ డైరెక్టర్ జైరాం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 14 : రాయికల్ మండలం ఆలూరు గ్రామంలో అంగన్వాడీ భవనం, గోదాం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ స్వామి శనివారం జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను కలిశారు. ఈ సందర్భంగా జగిత్యాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజిరెడ్డి, సర్పంచ్ రామస్వామి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చాచా నెహ్రూ జయంతి వేడుకలు



చురకలు ప్రతినిధి కోరుట్ల నవంబర్,14 : కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ అభివృద్ధికి, స్వాతంత్ర్యానంతరం భారత నిర్మాణానికి నెహ్రూ చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్ రైస్ ఉద్దీన్, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, కౌన్సిలర్లు మాసుల ప్రవీణ్, అజీమ్, మహేష్, కోఆప్షన్ సభ్యుడు మాధవరెడ్డి, నాయకులు అండి బాపూజీ, సురేష్, జెట్టి లక్ష్మణ్, పులిమామిడి ప్రవీణ్ కుమార్, పిప్ప రాజేష్, జాకీర్, ఖమ్మం నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా రీ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి

-ఇబ్రహీంపట్నం తాహసిల్దార్ వరప్రసాద్



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం నవంబర్ (14) : భూభారతి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వరప్రసాద్ సంబంధిత సర్వేయర్లను ఆదేశించారు. శనివారం మండలంలోని కేశాపూర్,కోజన్ కొత్తూరు గ్రామాల్లో కొనసాగుతున్న భూభారతి రీ సర్వే పనులను తహసీల్దార్ వరప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఇప్పటివరకు పూర్తయిన సర్వే వివరాలను, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పురోగతిని సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సర్వే నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న పనులపై ఆరా తీశారు.రీ సర్వే ప్రక్రియలో భూములకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. భూ యజమానులకు సంబంధించిన వివరాలు, భూముల హద్దులు, ఇతర రికార్డుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.సర్వే సమయం లో రైతులకు,భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సమాచారాన్ని అందిస్తూ పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువును దృష్టిలో ఉంచుకొని సర్వే పనుల్లో వేగం పెంచాలని, సిబ్బంది సమన్వయంతో పనిచేసి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈ నెల 18వ తేదీలోగా రిసర్వే ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, భూ సర్వేయర్లు,సిబ్బంది , రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

-మరొకరికి తీవ్ర గాయాలు

-మాధాపూర్ రామాలయం సమీపంలో బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



చురకలు ప్రతినిధి కోరుట్ల, నవంబర్ 14 : కోరుట్ల మండలం మాధాపూర్ గ్రామ శివారులోని రామాలయం సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో 19 ఏళ్ల యువకుడు మృతి చెందగా, మరో బాలుడికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే మాధాపూర్ గ్రామానికి చెందిన డొంకేశ్వర్ అశోక్ కుమారుడు డొంకేశ్వర్ హేమంత్ అలియాస్ ప్రశాంత్ (19), తన స్నేహితుడు గడ్డం నవీన్ (16)తో కలిసి హెచ్ఎఫ్ డీలక్స్ మోటార్ సైకిల్‌పై గ్రామం వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం సుమారు 12.15 గంటల సమయంలో రాయికల్ వైపు నుంచి కోరుట్లకు వస్తున్న టీజీఆర్టీసీ పల్లె వెలుగు బస్సు (నంబర్: టిజి 21 టి 2070) బైక్‌ను ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న హేమంత్ అలియాస్ ప్రశాంత్ తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. వెనుక కూర్చున్న నవీన్ తలకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై మృతుడి తండ్రి డొంకేశ్వర్ అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడి మృతికి కారణమైన బస్సు డ్రైవర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై కోరుట్ల పోలీసుల ప్రత్యేక డ్రైవ్



చురకలు ప్రతినిధి కోరుట్ల, నవంబర్ 14 : నంబర్ ప్లేట్లు లేకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై కోరుట్ల పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం కోరుట్ల పట్టణంలోని నంది చౌరస్తా వద్ద సీఐ తిరుపతి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో నంబర్ ప్లేట్లు లేని 50 ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేశారు.వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, సరైన నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకొని వాహనాలు నడపాలని పోలీసులు సూచించారు.ఈ ప్రత్యేక తనిఖీల్లో కోరుట్ల, కథలాపూర్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నవంబర్ 29 దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

-బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 14 : నవంబర్ 29న నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో కేటీఆర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేపట్టిన దీక్షకు గుర్తుగా ప్రతి ఏటా నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమ నిర్వహణపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. దీక్షా దివస్ రోజున చేపట్టాల్సిన కార్యాచరణ, నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యం, జిల్లాల వారీగా సమీకరణ, ప్రజలను పెద్ద ఎత్తున తరలించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందని, అదే స్ఫూర్తితో దీక్షా దివస్ కార్యక్రమానికి ప్రతి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, టి. జీవన్ రెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ జడ్పీ చైర్మన్లు, నియోజకవర్గ ఇంచార్జిలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య

-జగిత్యాల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు

చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 14 : అదనపు కట్నం వేధింపుల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జగిత్యాల పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి గోవిందుపల్లెలో శనివారం ఈ ఘటన జరిగింది. ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన సజ్జనపు నీరజ ఫిర్యాదు మేరకు ఆమె పెద్ద కుమార్తె రాగుల శ్రీ విజయ (25) నాలుగేళ్ల క్రితం మల్యాల మండలం రాంపూర్ గ్రామానికి చెందిన రాగుల వేణుగోపాల్ ను వివాహం చేసుకుంది. అనంతరం వారు జగిత్యాల గోవిందుపల్లెలో నివాసం ఉంటున్నారు. తన కుమార్తెను భర్త వేణుగోపాల్, అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం తరచూ వేధిస్తున్నారని, వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లి ఫిర్యాదులో పేర్కొంది.ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్ లో టౌన్ ఇన్ స్పెక్టర్ పి. కరుణాకర్ కేసు నమోదు చేశారు. డీఎస్పీ కె. పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

భారత్ సమ్మిట్‌ను వ్యతిరేకిస్తూ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం



చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 14 : తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ ను వ్యతిరేకిస్తూ జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో బీజేపీ నాయకులు శనివారం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు మాట్లాడుతూ ఇది భారతదేశ వ్యతిరేకుల సమ్మిట్ అని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు అనుకూలమని చూపించడం కోసం అంటూ భారత్ వ్యతిరేక శక్తులతో భారత్ సమ్మిట్ ఏర్పాటు చేశారని విమర్శించారు. పెట్టుబడుల కోసం కాకుండా ప్రజాస్వామ్యం, సామాజిక, ఆర్థిక న్యాయం, యువత, జెన్ జెడ్, ఎస్ఐఆర్ ప్రక్రియ లాంటి అంశాలను చర్చకు పెట్టి దేశంలో జాతీయ సమైక్యతకు భంగం కలిగించే ప్రక్రియకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారని అన్నారు. విదేశాల నుంచి 1000 మంది ప్రతినిధులను ఆహ్వానించి ఏ రాజ్యాంగబద్ధ పదవిలో లేని రాహుల్ గాంధీని ముఖ్య అతిథిగా పిలిచి కాంగ్రెస్ ప్రచారానికి వాడుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రపంచ దేశాల ప్రతినిధుల ముందు రాహుల్ గాంధీని భారతదేశానికి కాబోయే నాయకుడిగా చిత్రీకరించే ప్రయత్నాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ఒకపక్క ఎల్ నినో ప్రభావంతో తెలంగాణ కరువు కాటకాలతో అల్లాడుతుంటే కాంగ్రెస్ స్వార్థం కోసం వందల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని, తెలంగాణ ప్రభుత్వంతో సంబంధం లేని రాహుల్ గాంధీని పిలిచి రేవంత్ రెడ్డి ఢిల్లీ నాయకత్వానికి భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు కౌశెట్టి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, ఫ్లోర్ లీడర్లు వేముల శ్రీనివాస్, సిరిపురం శ్రీనివాస్, స్వరూప వేణుగోపాల్, జిల్లా పదాధికారులు, మోర్చా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మారుపాక రజిత ఆరోపణలు అవాస్తవం, నిరాధారం

-ఆరోపణలు వెనుక రాజకీయ కుట్ర దాగి ఉంది



చురకలు విలేకరి, కోరుట్ల, నవంబర్ 14 : మారుపాక రజిత చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమని, వాటి వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని మారుపాక రాజు పేర్కొన్నారు. కోరుట్లలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఏడేళ్ల న్యాయపోరాటం తర్వాత వచ్చిన హైకోర్టు తీర్పును వక్రీకరించడం తగదని, భూమి వివాదానికి రాజకీయ, మతపరమైన రంగు పులమడం వెనుక కుట్ర కోణం ఉందని ఆరోపించారు. మారుపాక రజిత తనకు చిన్నమ్మ వరుస అవుతుందని, ఆమె భర్త మల్లేశంకు చెందిన సొంత భూమిని గతంలోనే విక్రయించుకున్నారని తెలిపారు. అప్పట్లో వారి ఆర్థిక పరిస్థితిని గమనించి తమ తాత మానవతా దృక్పథంతో తమ సొంత ఇంటిలో నివాసానికి కొంత స్థలం కల్పించారని, ఆ తర్వాత ఇంటితో పాటు ఖాళీ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు వివాదం మొదలుపెట్టారని ఆరోపించారు. తానే అసలు పట్టాదారు వారసుడినని, తన సొంత భూమిలో కొంత భాగాన్ని కులబాంధవులకు విక్రయించానని, ప్రస్తుతం 153 గజాల ఖాళీ స్థలం మిగిలి ఉందని తెలిపారు. తాను విక్రయించిన స్థలంలో అప్పటి భూమాఫియా, ప్రస్తుత వార్డు కౌన్సిలర్ ప్రోద్బలంతో రజిత, మల్లేశం అక్రమ నిర్మాణానికి పూనుకున్నారని, మున్సిపల్ అధికారులు, కలెక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా నిర్మాణం నిలిపివేసినా రాత్రికి రాత్రే పూర్తి చేసి స్వాధీన ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించామని, ఆధారాలు పరిశీలించి ఏడేళ్ల తర్వాత తీర్పు వచ్చిందని తెలిపారు.చట్టబద్ధంగా భూమిని కొని అమ్మడం నేరం కాదని, దాన్ని కబ్జాగా చిత్రీకరించడం సరికాదని, న్యాయస్థాన తీర్పులను రాజకీయాలకు వేదికగా మార్చవద్దని, పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని స్పష్టం చేశారు.

కేరళ హైస్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

-విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు డ్రగ్స్, మొబైల్ ఫోన్ల దుర్వినియోగంపై అవగాహన



చురకలు ప్రతినిధి కోరుట్ల, నవంబర్ 14 : భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని కోరుట్ల పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు,ఆటపాటలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రస్తుత సమాజంలో యువతను ప్రభావితం చేస్తున్న డ్రగ్స్ వినియోగం, మొబైల్ ఫోన్ల దుర్వినియోగం, ఆన్‌లైన్ గేమ్స్, సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి అంశాలపై ఉపన్యాసాలు, నాటికల ద్వారా అవగాహన కల్పిస్తూ చక్కటి సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సెలెన్ బారి మాట్లాడుతూ,విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. పెద్దలు, గురువులు చూపిన మార్గంలో నడుస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని,తల్లిదండ్రులకు, గురువులకు,పాఠశాలకు,దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.ఏ. బారి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని పేర్కొన్నారు. పిల్లల మనసులు కల్మషం లేనివని, అందుకే నెహ్రూకు బాలలంటే ఎంతో ఇష్టమని తెలిపారు. ఆయన జన్మదినమైన నవంబర్ 14ను బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని వివరించారు.విద్యార్థులు డ్రగ్స్, మొబైల్ ఫోన్లు, ఆన్‌లైన్ గేమ్స్, సామాజిక మాధ్యమాల దుర్వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. విలువైన సమయాన్ని వృథాచేయకుండా చదువుపై దృష్టి సారించి, కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని పిలుపునిచ్చారు.ప్రతి విద్యార్థి మంచి పౌరుడిగా ఎదిగి దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.ఏ. బారి, ప్రిన్సిపల్ సెలెన్ బారి, చైర్మన్ ఎం.ఏ. హాది, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో ఆనందోత్సాహాలు నింపడంతో పాటు క్రమశిక్షణ,మంచి సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించిన ఈ వేడుకలు ఘనంగా ముగిశాయి.

జగిత్యాల ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు

-నంబర్ ప్లేట్లు లేని వాహనాలకు జరిమానాలు



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 14 : నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్న వాహనాలపై జగిత్యాల ట్రాఫిక్ పోలీసులు శనివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి సూచనల ప్రకారం జగిత్యాల పట్టణ సీఐ పి. కరుణాకర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్, సిబ్బందితో కలిసి పట్టణంలో ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలు, మోటార్ వాహనాల చట్ట నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్న వాహనాలను గుర్తించి మొత్తం 95 వాహనాలను అదుపులోకి తీసుకుని నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు. అనంతరం వాహన యజమానులకు సరైన, ప్రామాణిక నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీసుల సూచనల మేరకు వాహన యజమానులు స్వచ్ఛందంగా తమ వాహనాలకు ముందు, వెనుక వైపులా నిబంధనలకు అనుగుణంగా కొత్త నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ కరుణాకర్ మాట్లాడుతూ ప్రతి వాహనానికి తప్పనిసరిగా నిబంధనల ప్రకారం ప్రామాణిక నంబర్ ప్లేట్లు ఉండాలని, నంబర్ ప్లేట్లు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

సూర్య గ్లోబల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 14 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని సూర్య గ్లోబల్ స్కూల్ లో బాలల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకల్లో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ రకాల వేషధారణలతో అలరించారు. జానపద, శాస్త్రీయ, దేశభక్తి గీతాలపై ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ప్రదర్శించిన అద్భుతమైన నృత్యాలు, వినూత్నమైన విన్యాసాలు, సృజనాత్మక ప్రదర్శనలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని వెలికితీశాయి. చిన్నారుల ప్రతిభను



చూసి తల్లిదండ్రులు, పోషకులు ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య బాలల దినోత్సవ వేడుకలు ఉల్లాసభరిత వాతావరణంలో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శ్రీధర్ రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తు అని, వారి చేతుల్లోనే రేపటి సమాజ నిర్మాణం ఉందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రమశిక్షణ, మంచి నడవడిక, సమయపాలన, సేవాభావం అలవర్చుకోవాలని సూచించారు. పుస్తక జ్ఞానంతో పాటు ఆటలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ఆసక్తి కనబరచాలని తెలిపారు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి నిరంతర సాధనతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, గురువుల ఆశయాలను నెరవేరుస్తూ మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్ రావు, హరిచరణ్ రావు, మౌనిక, రజిత, సుమన్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

-స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి వెంకటేశ్వర్లు



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట,నవంబర్ 14 : బాల్యవివాహాల నిర్మూలన ప్రతి పౌరుడి బాధ్యత అని రాజన్న సిరిసిల్ల జిల్లా స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి గాండ్ల వెంకటేశ్వర్లు సూచించారు.శుక్రవారం డిపిఓలో బాల్యవివాహాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ చేశారు.బాల్యవివాహ రహిత భారతదేశం – బాల్యవివాహ రహిత రాజన్న సిరిసిల్ల జిల్లా దిశగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, బాల్యవివాహ రహిత భారతదేశం కార్యక్రమంలో భాగంగా,రాజన్న సిరిసిల్ల జిల్లాను బాల్యవివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతోమహిళా,శిశు సంక్షేమ శాఖ మరియు ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనకు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ వెంకటేశ్వర్లు , మరియు పోలీస్ సిబ్బంది పోస్టర్‌ను ఆవిష్కరించి, బాల్యవివాహాల వల్ల బాలికల భవిష్యత్తు, విద్య, ఆరోగ్యం మరియు సామాజిక జీవితంపై కలిగే ప్రతికూల ప్రభావాల గురించి వివరించారు.బాల్యవివాహాలను అరికట్టడంలో పోలీస్ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు,స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సందర్భంగా స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాల్యవివాహ రహిత జిల్లాగా రాజన్న సిరిసిల్లను తీర్చిదిద్దేందుకు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసిపిఓ కవిత,ఆశ్రిత ఎన్జీవో స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పర్వతాలు, ఫైనాన్స్ మేనేజర్ వెంకటేష్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ స్రవంతి, ఆశ్రిత ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ లహరి, హరిబాబు, ప్రశాంత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో పెద్ద ఎత్తున బాలల గ్రామసభ



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 14 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ అధ్యక్షతన బాలల గ్రామసభ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, వసతుల గురించి వివరించారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని సర్పంచ్‌హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలోని బీసీ హాస్టల్‌లో క్రితమే బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కలిసి హాస్టల్ సమస్యలను వివరించడం జరిగిందని తెలిపారు. త్వరలోనే హాస్టల్‌లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు హామీ ఇచ్చారు.అలాగే బీసీ హాస్టల్‌లో జనగామ గణేష్ తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేయనున్న వాటర్ ప్లాంట్‌ను కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులు కోరగా, వారం రోజుల ఉపాధ్యాయులు, యువకులు, రైతులు, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం



-రైస్ మిల్ యజమాని అరెస్ట్,రిమాండ్

చురకలు విలేఖరి వీణవంక నవంబర్ 14 : పేదలకు ఉచితంగా అందాల్సిన పీడీఎస్ రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలుచేసి విక్రయిస్తున్న రైస్ మిల్ యజమానిని వీణవంక పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం...ఈ నెల 5న కోర్కల్ గ్రామంలోని వాసవి ఎంటర్‌ప్రైజెస్ వద్ద హైదరాబాద్ ఈటీఎఫ్ అధికారులు తనిఖీలు నిర్వహించి,ఓ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 23.80 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా డ్రైవర్ కుర్ర తిరుపతి గ్రామాల నుండి కిలో రూ.20 చొప్పున బియ్యం సేకరించి, వాసవి రైస్ మిల్ యజమాని నార్ల వెంకటేశ్వర్లుకు కిలో రూ.25కు అమ్ముతున్నట్లు తేలింది. వెంకటేశ్వర్లు ఆ బియ్యాన్ని కోళ్ల ఫారాలకు కిలో రూ.30 చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. నిందితుడు నార్ల వెంకటేశ్వర్లుపై గతంలోనూ రూ.4.16 కోట్ల విలువైన (12,914.83 క్వింటాళ్ల) ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం చేసిన కేసు నమోదై ఉంది. తరచూ ఇదే తరహా నేరాలకు పాల్పడుతుండటంతో శుక్రవారం (నవంబర్ 13) అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వీణవంక ఎస్.ఐ.ఆవుల తిరుపతి హెచ్చరించారు.

అంగరంగ వైభవంగా

బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం



చురకలు విలేఖరి వీణవంక నవంబర్ 14 : వీణవంక మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అచ్చంపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భూలక్ష్మి, మహాలక్ష్మి, పోచమ్మ తల్లి, బొడ్రాయి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా యాగశాల ప్రదేశంలో అగ్ని ప్రతిష్ఠ, మూల యంత్రం హోమం, విగ్రహాలకు జలాధివాసం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎస్సై ఆవుల తిరుపతి హాజరై గ్రామ ప్రజలకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎస్సై ఆవుల తిరుపతి మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని, గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుకోవాలని అన్నారు. బొడ్రాయి ప్రతిష్ఠతో గ్రామంలో సుఖశాంతులు, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ఒకే మూర్తిగా బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో అచ్చంపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో భక్తి వాతావరణం నెలకొంది. పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతులకు లాభం



చురకలు (పెద్దపల్లి జిల్లా ప్రతినిధి)కమాన్‌పూర్ (పాలకుర్తి) నవంబర్ 14 : కాంగ్రెస్ ప్రభుత్వం తోనే ప్రతి రైతుకు న్యాయం జరుగుతుంది అని కన్నాల సింగల్ విండో చైర్మన్ బయ్యపు మనోహర్ రెడ్డి అన్నారు.పాలకుర్తి మండలం బామ్లా నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలో వడ్ల కొనుగోలు సెంటర్ ప్రారంభించిన ఫ్యాక్స్ చైర్మన్ మనో రెడ్డి ప్రారంభించారు సర్పంచ్ అఖిలా అంజినాయక్,ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్నిప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ... రైతులకు సడ్డవరి ధాన్యానికి 500 బోనస్ క్వింటాకు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. రైతుల రుణమాఫీ రైతుబంధు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇది రైతు ప్రభుత్వం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కన్నాల మాజీ సర్పంచ్ లాల్ సింగ్ ఉపసర్పంచ్ రాజేశ్వరి సారయ్య వార్డు మెంబర్లు దేవా సింగిల్ విండో డైరెక్టర్ సక్లాల్, మంజునాయక్, రాజు నాయక్, బాలు నాయక్ మరియు హమాలి కార్మికులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట నవంబర్ 14 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ కింద 6గురు లబ్ధిదారులకు 2 లక్షల 72 వేల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మండలంలో 108మంది లబ్ధిదారులకు 36 లక్షల 62వేలు మంజూరయ్యాయని అన్నారు ఇందుకు సంబంధించినటువంటి చెక్కులు వివిధ గ్రామాలలో స్థానిక ప్రజాప్రతినిధులు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు పేదవారి ఆరోగ్యం పట్ల ప్రభుత్వం శ్రద్ధ వహిస్తుందని అన్నారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 10 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు అలాగే ఆసుపత్రులలో ఆపరేషన్లు అవసరమైతే హైదరాబాదులోని నిమ్స్ లో ఆపరేషన్లు చేయించుకుంటే ఎల్ఓసి ద్వారా డబ్బులు ఇప్పించడం జరుగుతుందని అన్నారు ఒకవేళ అత్యవసర పరిస్థితిలో ప్రైవేట్ ఆస్పత్రులలో వైద్యం చేయించుకుంటే ముఖ్యమంత్రి సహాయ నిధి కింద వారికి మూడు నెలల కాలంలోనే డబ్బులు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు సహకరించిన సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మధుసూదన్ రెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిరిపురం మహేందర్ వార్డు సభ్యులు జెల్లరవి జెల్ల గణేష్ దివ్యభారతి.సాయి కృష్ణగౌడ్. ఆకారం బాలు పాల్గొన్నారు.

మూడవత్ తండాలో అగ్నిప్రమాదం



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 14 : ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామం మూడవత్ తండాలో ప్రమాదవశాత్తు రైతుల యొక్క నిలువ ఉంచిన గడ్డి కట్టలకు మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో గడ్డి కట్టలు పూర్తిగా దగ్ధమై బూడిదయ్యాయి.మూడవత్ మోతిరం – 565 గడ్డికట్టలు.హీరా నాయక్ 200కట్టలు మూడావత్ గుండియా నాయక్ 250గడ్డి కట్టలు అంటుకున్నాయి.వెంటనే సర్పంచ్ ముడావత్ సరోజ చంద్రు నాయక్ గారు ఫైర్ ఇంజన్ కి ఇన్ఫర్మేషన్ ఇవ్వడంతోని సంఘటన స్థలానికి ఫైర్ ఇంజన్ వచ్చి ఫైర్ సిబ్బంది శ్రమించి వెంటనే మంటను అదుపులోకి తీసుకువచ్చారు.

కార్తీక పౌర్ణమి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కేటీఆర్‌కు ఆహ్వానం



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 14 : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ఈ నెల 19వ తేదీ నుంచి 24 వ తేదీ వరకు నిర్వహించనున్న కార్తీక పౌర్ణమి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు.నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డితో పాటు మీసం రాజం,వెంకటరెడ్డి,అజ్జు, సందీప్‌లు కేటీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ సందర్భంగా కేటీఆర్‌ను శాలువాతో సత్కరించి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరారు.ఈ నెల 19నుంచి 24వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించాలని కేటీఆర్ వారికి సూచించారు.

ఘనంగా గణపతి పూజ హోమాలు



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 14 : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో స్థానిక గౌడ సంక్షేమ సంఘం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి నూతన ఆలయాన్ని చూడముచ్చటగా సుందరంగా రాతితో సుమారు మూడు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించారు.శనివారం 14వ తేదీన గణపతి పూజ హోమం 15వ తేదీన మహా యాగాలు ఇతర విశేష హోమాలు 16వ తేదీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దివ్య విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం 17వ తేదీన మహిళలతో పెద్ద ఎత్తున బోనాలు తీయడం 18వ తేదీన సిద్ధోగం రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలయాన్ని శనివారం సందర్శించగా వారికి స్థానిక గౌడ సంక్షేమ సంఘం ప్రతినిధులు చింతకింది దేవయ్య గౌడు పుల్లయ్య గారి తిరుపతి గౌడు గంట దేవయ్యగౌడులు స్వాగతం పలికారు అక్కడ గణపతి పూజ కార్యక్రమాలను స్థానిక గౌడ సంఘం ప్రతినిధుల దంపతుల చేత బ్రాహ్మణోత్తములు నిర్వహించే హోమాలను తిలకించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ మేడిపల్లి దేవానందం వైస్ చైర్మన్ నందికిషన్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు దోమ్మాటి నరసయ్య మాజీ మండలాధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు రాజన్నపేట సర్పంచ్ బాపురెడ్డి,ఏఏం సి డైరెక్టర్లు చంద్రు నాయక్ దండు శ్రీనివాస్ ముదిరాజ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి బాల్ రెడ్డి గుర్రాల రాజిరెడ్డి మూర్తి వెంకటేష్,మద్దుల శ్రీపాల్ రెడ్డి ఇలియాస్ బాబా, వడ్నాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా చాచా నెహ్రూ జయంతి వేడుకలు

-నెహ్రూకు పిల్లలన్నా గులాబీలన్నా అమితమైన ప్రేమ



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 14 : ఎల్లారెడ్డిపేట మండలంలో శనివారం 14 నవంబర్ సందర్భంగా భారత్ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చాచాజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి .ఎల్లారెడ్డిపేట పాత బస్టాండ్ లోని జవహర్లాల్ నెహ్రూ విగ్రహానికి ఏఎం సి చైర్మన్ మేడిపల్లి దేవానందం,వైస్ చైర్మన్ నందికిషన్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య పట్టణ అధ్యక్షులు చెన్ని బాబులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మేడిపల్లి దేవానందం సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్రెడ్డిలు మాట్లాడుతూ నెహ్రూకు పిల్లలన్నా, గులాబీలన్నా అమితమైన ప్రేమ అన్నారు.చిల్డ్రన్స్ డే స్పెషల్ అలీనోద్యమానికి ఆద్యుడు.. సోషలిజానికి జైకొట్టిన భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ... బ్రిటిష్ పాలనలో దోపిడీకి గురైన దేశ ఆర్థిక వ్యవస్థను పంచవర్ష ప్రణాళికలు చేపట్టి ఆర్థికాభివృద్ధికి ఎంతగానో ఆయన పాటుపడ్డారు. ఇక, నెహ్రూకి బాలల అంటే ఎంతో ఇష్టం. అందుకే ఆయన పుట్టిన రోజును బాలల దినోత్సవంగా జరుపుకుంటాం. ప్రపంచ వ్యాప్తంగా నవంబరు 20న చిల్డ్రన్స్ డే జరిపితే అంతకు 6రోజుల ముందే భారత్‌లో ఈ వేడుక వస్తుంది.నెహ్రూ భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిల్డ్రన్స్ డేగా చాచా నెహ్రూ జన్మదినం నవంబరు 20 ప్రపంచ బాలల దినోత్సవం ఏటా నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని దేశవ్యాప్తం గా అత్యంత సంతోషంగా ఓ వేడుకలా జరుపుకుంటాం. స్వాతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పుట్టిన రోజునే బాలల దినోత్సవం గా నిర్వహిస్తున్నారు. ఆయన జన్మదినాన్ని 'చిల్డ్రన్స్ డే'గా నిర్వహించుకోవడానికి బలమైన కారణం ఉందన్నారు. భారతదేశ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ అత్యధిక కాలం ప్రధానిగా సేవలు అందించారన్నారు. బ్రిటిష్ వలసవాదుల దోపిడీకి గురైన భారతావని నేడు ఆర్థికంగా పరిపుష్టి సాధించిందంటే అందులో నెహ్రూ దార్శనికత,ముందుచూపు కారణం. ప్రధానిగా ఆయన అనుసరించిన విధానాలు దేశం ఆర్థికంగా బలపడటానికి పునాదులు వేశాయన్నారు,1889 నవంబర్ 14న అలహాబాద్‌లో జన్మించిన నెహ్రూ భారత జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారు.నెహ్రూకు పిల్లలన్నా, గులాబీలన్నా అమితమైన ప్రేమ. నెహ్రూ ఎక్కడికెళ్లినా.. పిల్లలను వెతికి మరీ ఆప్యాయంగా పలకరించేవారు. వారికి కానుకలను ఇచ్చి ఉత్సాహపరిచేవారు. స్వాతంత్ర పోరాటంలో భాగంగా జైల్లో ఉన్నప్పుడు తన కుమార్తె ఇందిరకు అనేక ఉత్తరాలు రాసేవారు.నెహ్రూ నింపిన స్ఫూర్తి, ధైర్యంతో ఇందిర 'ఉక్కు మహిళ'గా రూపొందారు. ప్రధానిగా పలు సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకొని దేశాన్ని ముందుకు నడిపారు. తన కుమార్తె ఇందిరకు నెహ్రూ రాసిన ఉత్తరాలు నేటి తరానికి పాఠాలయ్యాయన్నారు ఆయన చెప్పిన ఆ మంచి మాటలు మనం ఎప్పటికీ ఆచరించదగినవే అన్నారు.పిల్లలకు కూడా పండిట్ నెహ్రూ అంటే వల్లమానిన ప్రేమ. ఆయణ్ని ముద్దుగా 'చాచా నెహ్రూ', 'చాచాజీ' అని పిలుచే వారన్నారు.1964లో నెహ్రూ మరణించిన తర్వాత ఆయన పుట్టిన రోజును 'బాలల దినోత్సవం'గా నిర్వహించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. నాటి నుంచి నవంబర్ 14ను'చిల్డ్రన్స్ డే'గా జరుపుకొంటున్నాం స్వాతంత్ర్యానికి ముందు బాలల దినోత్సవాన్ని నవంబర్ 20న అన్ని దేశాలతోపాటు నిర్వహించుకునేవాళ్లం. నవంబరు 20న చిల్డ్రన్స్ డే నిర్వహించాలని ఐక్యరాజ్య సమితిలోని సభ్యదేశాలు తీర్మానించాయి. 1964 వరకు భారత్ కూడా దీనినే అనుసరించినా నెహ్రూ మరణం తర్వాత నుంచి నవంబర్ 14న చిల్డ్రన్స్ డే జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి ఏఎంసీ మాజీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్ రెడ్డి, ఏం సి డైరెక్టర్లు దండు శ్రీనివాస్ అంతేర్పుల గోపాల్ , నాయకులు గుర్రాల రాజిరెడ్డి వంగ శ్రీకాంత్ రెడ్డి బాలరాజ్ రమేష్ గౌడ్ బాలరాజు, మద్దుల శ్రీపాల్ రెడ్డి బందారపు మల్లారెడ్డి, గఫర్ బాయ్ వడ్నాల వెంకటేష్ కదిరే కి న్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

గురుశ్రేష్ఠ అవార్డుల వేడుకలో పాల్గొన్న చైర్మన్ దంపతులు



చురకలు ప్రతినిధి,నిర్మల్, నవంబర్, 14 : నిర్మల్ పట్టణంలోని ఆర్.కె. ఫంక్షన్ హాల్‌లో ట్రస్మా (తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం) నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన గురుశ్రేష్ఠ అవార్డుల ప్రధాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి నిర్మల్ మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ శ్రీ అప్పాల గణేష్ చక్రవర్తి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమానికి విశిష్టతను చేకూర్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను బోధిస్తూ వారిని బాధ్యతాయుతమైన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలు ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. విద్యారంగ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారిని గురుశ్రేష్ఠ అవార్డులతో సత్కరించడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులందరికీ ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్పీ రాజు, కత్తి నరేందర్, మాజీ కౌన్సిలర్ తోట నర్సయ్య, ట్రస్మా జిల్లా ప్రతినిధులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యారంగ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సేవలను గౌరవిస్తూ, విద్యారంగ అభివృద్ధికి ప్రోత్సాహం అందించిన ఈ గురుశ్రేష్ఠ అవార్డుల కార్యక్రమం ఘనంగా ముగిసింది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



చురకలు ప్రతినిధి,నిర్మల్, నవంబర్, 14 : నిర్మల్ జిల్లా నర్సాపూర్-జి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో రూ.56.85 లక్షల వ్యయంతో నిర్మించనున్న బాలికల పాఠశాల భవన నిర్మాణ పనులకు బీజేపీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం గత విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి టాపర్లుగా నిలిచిన కావేరి (ఎంపీసీ), కీర్తన (బైపీసీ) విద్యార్థినులను శాలువాలతో సత్కరించి అభినందించారు.అదేవిధంగా, నర్సాపూర్-జి మండలంలో నూతనంగా మంజూరైన పెన్షన్లకు సంబంధించిన మంజూరు ఉత్తర్వు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం గ్రామ సమాఖ్య భవన నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షులు నరేందర్,సర్పంచులు,బీజేపీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వాసవి వరల్డ్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



చురకలు ప్రతినిధి,నిర్మల్, నవంబర్ 14 : భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని వాసవి వరల్డ్ స్కూల్ లో బాలల దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు వివిధ రంగుల దుస్తుల్లో అందంగా ముస్తాబై వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వినోదభరితమైన ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల ఉత్సాహం, ప్రతిభ, కళాత్మక నైపుణ్యాలు కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ, “పిల్లలే దేశ భవిష్యత్తు. ప్రతి విద్యార్థిలోనూ అపారమైన ప్రతిభ దాగి ఉంటుంది. విద్యతో పాటు సృజనాత్మకత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, మానవీయ విలువలను పెంపొందించుకోవాలి. ప్రతి ఒక్కరూ తమ కలలను లక్ష్యాలుగా మలుచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి.పిల్లలందరూ ఆనందంగా,ఆరోగ్యంగా, బాధ్యతా యుతమైన పౌరులుగా ఎదగాలని” ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్యాట్రన్ లింగారెడ్డి, సెక్రటరీ జగదీష్ రెడ్డి, కరస్పాండెంట్ పోతా రెడ్డి, చీఫ్ అడ్వైజర్ మోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ శైలజాయిసన్,ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య బాలల దినోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

కొత్త అభ్యర్థులకు అవకాశం కల్పించండి

-హుజురాబాద్ క్లబ్ అభివృద్ధికి నూతన బృందాన్ని ఆశీర్వదించండి
-వైస్ ప్రెసిడెంట్ అభ్యర్థి పుల్లూరు ప్రభాకర్ రావు, కార్యదర్శి అభ్యర్థి కట్కూరి మల్లారెడ్డి



చురకలు ప్రతినిధి హుజూరాబాద్, నవంబర్ 14 : హుజురాబాద్ క్లబ్ ఎన్నికలు ఆదివారం (నవంబర్ 15) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగనున్న నేపథ్యంలో, క్లబ్ సభ్యులకు ఉపాధ్యక్షునిగా పోటీ చేస్తున్న పుల్లూరి ప్రభాకర్ రావు, కార్యదర్శిగా పోటీ చేస్తున్న కట్కూరి మల్లారెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కొత్త అభ్యర్థులకు అవకాశం కల్పించి, క్లబ్ గౌరవాధ్యక్షులు కెప్టెన్ లక్ష్మీకాంతరావు ఆధ్వర్యంలో క్లబ్ అభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు తమ బృందానికి మద్దతు ఇవ్వాలని కోరారు.దివంగత మాజీ రాజ్యసభ సభ్యులు వొడితల రాజేశ్వరరావు ఆశయాలు, క్లబ్ గౌరవ చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతరావు లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తామని తెలిపారు. హుజురాబాద్ క్లబ్ ఏర్పాటుకు కెప్టెన్ లక్ష్మీకాంతరావు నిధులు సమకూర్చడంలో చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. క్లబ్‌ను కాపాడుకోవడం సభ్యులందరి బాధ్యతగా భావించాలని కోరారు.తాము ఎన్నికల్లో విజయం సాధిస్తే వరంగల్, కరీంనగర్ క్లబ్‌లతో హుజురాబాద్ క్లబ్‌ను అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే ఈ దిశగా స్నేహితుల ద్వారా సంప్రదింపులు జరిపామని వెల్లడించారు. సభ్యుల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా వారి సలహాలు, సూచనలను కెప్టెన్ లక్ష్మీకాంతరావు దృష్టికి తీసుకెళ్లి క్లబ్‌ను మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు.ఎలాంటి పదవులు లేకున్నా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సహాయ సహకారాలు అందిస్తున్నానని వైస్ ప్రెసిడెంట్ అభ్యర్థి నాగార్జున డైరీ ప్రభాకర్ రావు, మల్లారెడ్డి గుర్తు చేశారు. గతంలో బాధ్యతలు నిర్వహించిన వారు వరంగల్, కరీంనగర్ క్లబ్‌లతో హుజురాబాద్ క్లబ్‌ను ఎందుకు అనుసంధానం చేయలేకపోయారనే ప్రశ్నలు సభ్యుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. రాజకీయాలకు వేదికగా కాకుండా, కెప్టెన్ లక్ష్మీకాంతరావు ఆశయాలకు అనుగుణంగా క్లబ్ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, సామాజిక సేవకు ప్రాధాన్యతనిచ్చే నూతన బృందానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విద్యావంతులు, విజ్ఞులైన క్లబ్ సభ్యులు ఆలోచించి తమ బృందాన్ని ఆశీర్వదించాలని వైస్ ప్రెసిడెంట్ అభ్యర్థి పుల్లూరు ప్రభాకర్ రావు, కార్యదర్శి అభ్యర్థి కట్కూరి మల్లారెడ్డి కోరారు.

16వ సారి శబరిమలకు స్వాముల పాదయాత్ర



చురకలు ప్రతినిధి,నిర్మల్, నవంబర్, 14 : నిర్మల్ జిల్లా నుంచి జీ శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో 68 మంది అయ్యప్ప స్వాములు వరుసగా 16వసారి శబరిమల పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరడం అభినందనీయం అని కొనియాడారు.ఈ పవిత్రయాత్ర భక్తిశ్రద్ధలతో,ఆధ్యాత్మిక చింతనతో విజయ వంతంగా కొనసాగాలని,మార్గమధ్యంలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా స్వామివారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షి స్తున్నమని తెలిపారు. అయ్యప్ప స్వామి దివ్య దర్శనం చేసుకుని,యాత్రను సురక్షితంగా పూర్తిచేసుకుని క్షేమంగా తిరిగిరావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని స్వాములు తెలిపారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 14 : రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకులు కొండూరి గాంధీరావు సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డిలు పరామర్శించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొండూరు గాంధీరావు కేకే మహేందర్ రెడ్డిలు ఆది శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.ఆయన ఆరోగ్య పరిస్థితి, క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కొద్దిసేపు పరస్పరం మాట్లాడుకున్నారు. నాయకుల పరస్పర కలయికతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆత్మీయ వాతావరణం నెలకొంది.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



చురకలు (పెద్దపెల్లి జిల్లా ప్రతినిధి) కమాన్ పూర్ నవంబర్ 14 : రామగిరి మండలం కల్వచర్ల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా బాలల హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం, బాలల భద్రత, సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేసి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పిల్లలే దేశ భవిష్యత్తు అని, వారి ఎదుగుదలే సమాజ అభివృద్ధికి పునాది అని అన్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించడంతో పాటు, వారి అభిరుచులు, ఆసక్తులు, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంపై ఉందన్నారు. బాల కార్మిక వ్యవస్థకు దూరంగా ఉంచి ప్రతి బిడ్డ బడికి వెళ్లేలా చూడాలని సూచించారు. విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించేలా పిల్లలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.బాలల సంతోషకరమైన బాల్యం, సురక్షితమైన భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ సమిష్టిగా కృషి చేయాలని సర్పంచ్ కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉప్పులేటి ప్రదీప్,ఫీల్డ్ అసిస్టెంట్ కొమురయ్య, వార్డు సభ్యులు, ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్లు,చిన్నారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సింగరేణి ప్రభావిత, మంథని నియోజకవర్గ

నిరుద్యోగ యువతకు ఐటీ నైపుణ్య శిక్షణ

- మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలతో శిక్షణ కేంద్రం ఏర్పాటుకు చర్యలు



చురకలు పెద్దపల్లి జిల్లా ప్రతినిధి కమాన్ పూర్ నవంబర్ 14 : సింగరేణి భూసేకరణతో ప్రభావితమైన కుటుంబాల నిరుద్యోగ యువత, మహిళలకు ఐటీ రంగంలో నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు స్థానికంగా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు ఐటీ శిక్షకుల ద్వారా ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి తరగతులు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు శనివారం ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో జీఎం సుంకర మధుసూదన్‌తో రాష్ట్ర ఐటీ ,పరిశ్రమల శాఖ లైజాన్ అధికారి అంజన్ కుమార్,ఐటీ ప్రతినిధి ఇజ్జగిరి రాజు సమావేశమై శిక్షణ కేంద్రం ఏర్పాటుపై చర్చించారు. సింగరేణి భూసేకరణతో ప్రభావితమైన కుటుంబాల యువతతో పాటు మహిళలకు ప్రాధాన్యతనిస్తూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీ నైపుణ్య శిక్షణ అందించనున్నారు. శిక్షణ పొందిన వారికి వివిధ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.స్థానిక యువతకు సాంకేతిక నైపుణ్యాలు అందించి ఉద్యోగ అర్హతలను పెంపొందించడం, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం, మంథని ప్రాంతంలో ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

కరీంనగర్‌లో అల్లర్లు సృష్టించేందుకు కుట్ర

-మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి లేకుండానే ఈద్గావద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి యత్నం
-బీఆర్ఎస్ ముఖ్య నేతల హస్తముంది
-జిల్లా అదనపు కలెక్టర్, కమిషనర్‌లకు బీజేపీ కార్పొరేటర్ల ఫిర్యాదు



చురకలు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 14 : కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి లేకుండానే ఈద్గా వద్ద రిటైనింగ్ వాల్ కట్టి, మొక్కలు నాటి మత విద్వేషాలు రగిలించాలని కుట్రచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ కార్పొరేటర్లు ఈరోజు జిల్లా అదనపు కలెక్టర్ అశ్వనీ తానాజీ వాకడే, నగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ను కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ 1 టౌన్ పోలీస్ స్టేషన్ ముందున్న ఈద్గా వద్ద కొందరు వ్యక్తులు మూడు రోజుల క్రితం (2026 నవంబర్ 11న) రిటైనింగ్ వాల్ కట్టేందుకు కంకర, ఇసుకను తీసుకొచ్చి జేసీబీతో పనులు ప్రారంభించారని ఫిర్యాదు చేశారు. అక్కడే మొక్కలు నాటాలని యత్నించారని పేర్కొన్నారు. ఈ పనులకు మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి లేదని, కనీసం అనుమతి కూడా కోరలేదని గుర్తు చేశారు. హిందూ, ముస్లిం వర్గాల మధ్య మత విద్వేషాలు రగిలించి గొడవలు సృష్టించేందుకు కుట్ర చేసినట్లు కన్పిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నేత హస్తం ఉన్నట్లు భావిస్తున్నట్లు తెలిపారు.తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేసి కరీంనగర్ లో గొడవలు సృష్టించి విద్వేషాలు రగిలించి బీజేపీని బదనాం చేయడమే లక్ష్యంగా సదరు వ్యక్తులు ఈ కుట్రకు తెరదీసినట్లు ఆరోపించారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని ఏ ఉద్దేశంతో ఈ కుట్రకు తెరదీశారో సమగ్ర విచారణ జరపాలని కోరారు. మత విద్వేషాలు రగిలించి కరీంనగర్ లో అల్లర్లు సృష్టించాలని కుట్ర చేసిన వ్యక్తులపై తక్షణమే నాన్ బెయిలెబుల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. ప్రశాంతమైన కరీంనగర్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్, కార్పొరేషన్ విప్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, కార్పొరేటర్లు బండ రమణారెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జ శ్రీను, ఉప్పరపల్లి శ్రీనివాస్ తదితరులు అదనపు కలెక్టర్, పోలీస్ కమిషనర్ ను కలిసిన వారిలో ఉన్నారు.

డంపింగ్ యార్డా.. కాలుష్య కేంద్రామా..?

-డంపింగ్ యార్డు పాగతో ప్రజలకు అవస్థలు
-పాగతో పంట పొలాలకు నష్టం
- మూడు నెలల క్రితం ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం నవంబర్ (14) : గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు ప్రజలకు సౌకర్యం కల్పించాల్సింది పోయి సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి.డంపింగ్ యార్డుల్లో పేరుకుపోతున్న చెత్తను తొలగించేందుకు బహిరంగంగా నిప్పు పెట్టడంతో దట్టమైన పొగ పరిసర ప్రాంతాలను కమ్మేస్తోంది. ఈ పొగతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, పంట పొలాలు,రహదారులపై కూడాప్రతికూల ప్రభావం పడుతోంది. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూర్ గ్రామ శివారులో డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పక్కన మెట్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డును ఏర్పాటు చేయడంతో మండల పరిధిలోని ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డంపింగ్ యార్డులో పేరుకుపోతున్న చెత్తను కాల్చడం వల్ల వెలువడుతున్న పొగతో సమీపంలోని వ్యవసాయ భూములు కాలుష్యానికి గురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు సైతం దుర్గంధం, పొగతో ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై పొగ కమ్ముకోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలు జరిగే పరిస్థితులు నెలకొంటున్నాయి.ఈ సమస్యపై గోదూర్ సర్పంచ్ బండి రాజేష్ మూడు నెలల క్రితమే మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. డంపింగ్ యార్డును అక్కడి నుంచి తరలించాలని, ప్రజలకు, రైతులకు, ప్రయాణికులకు కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని కోరినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పొగతో పంటలకు నష్టం.. రైతుల్లో ఆందోళన..

డంపింగ్ యార్డులో చెత్తను కాల్చడంతో వెలువడుతున్న పొగ సమీపంలోని వ్యవసాయ భూములపైకి వ్యాపిస్తోంది. ఇప్పటికే వాతావరణ పరిస్థితులు, సాగునీటి సమస్యలు, పెట్టుబడి ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ పొగ మరో సమస్యగా మారుతోంది. పంటలపై నిరంతరం పొగ ప్రభావం పడితే మొక్కల ఎదుగుదల, ఆకుల ఆరోగ్యం, దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి సాగు చేస్తున్న పంటలు కాలుష్యం బారిన పడితే ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

రహదారిపై పొగ.. ప్రయాణికులకు ప్రమాదం..

డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న దట్టమైన పొగ సమీప రహదారులపైకి చేరుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగ కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణించే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పొగలో ప్రయాణించడం వల్ల కళ్ల మంట, దగ్గు, గొంతు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రహదారిపై వాహనాల రాకపోకలు అధికంగా ఉండే సమయంలో పొగ వ్యాపిస్తే ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజారోగ్యానికి ముప్పుగా కాలుష్యం..

చెత్తలో ప్లాస్టిక్, రబ్బరు, ఇతర వ్యర్థ పదార్థాలు కలిసి ఉండటంతో వాటిని కాల్చినప్పుడు వెలువడే పొగ పర్యావరణానికి హాని కలిగించే ప్రమాదం ఉంది. ఈ పొగను పీల్చడం వల్ల శ్వాసకోశ సమస్యలు, కళ్ల మంట, గొంతు ఇబ్బందులు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలున్న వారు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే మార్గాల సమీపంలోనే ఇలాంటి పరిస్థితులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

డంపింగ్ యార్డ్డం సమస్యను పరిష్కరించాలి

బండి రాజేష్ - సర్పంచ్ గోదూర్

డంపింగ్ యార్డు పొగతో ప్రజలు ఇబ్బందులు పడటమే కాకుండా, పంట పొలాలకు నష్టం కలిగే ప్రమాదం ఉందని, రహదారిపై ప్రయాణించే వాహనదారుల భద్రతకు ముప్పు ఏర్పడుతోంది మూడు నెలల క్రితమే మున్సిపల్ కమిషనర్, చైర్మన్‌కు వినతిపత్రాలు అందించాం.అధికారులు వెంటనే స్పందించి డంపింగ్ యార్డును తరలించడంతో పాటు చెత్త దహనాన్ని అరికట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

నిత్యం పంటలకు పొగ పారుతుంది

ద్యావేని లక్ష్మీనారాయణ - రైతు గోదూర్

డంపింగ్ యార్డులో వ్యర్థాలను కాల్చడంతో వెలువడుతున్న దట్టమైన పొగ సమీపంలోని పంట పొలాలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. చెత్తను కాల్చినప్పుడు వచ్చే పొగ వ్యవసాయ భూములపైకి వ్యాపిస్తోందని, దీంతో పంటలపై ప్రతికూల ప్రభావం పడుతోంది, ఇప్పటికే సాగు కోసం పెట్టుబడులు పెట్టి పంటలను కాపాడుకునేందుకు కష్టపడుతున్న రైతులకు డంపింగ్ యార్డు పొగ మరో సమస్యగా మారింది. అధికారులు స్పందించాలి.

యువత రాజకీయాల్లో, క్రీడా రంగంలో రాణించేలా ప్రోత్సహించాలి

-ఎంపీ గడ్డం వంశీకృష్ణ



చురకలు (పెద్దపల్లి జిల్లా ప్రతినిధి) కమాన్‌పూర్ నవంబర్ 14 : యువత క్రీడలతో పాటు విద్యలో రాణించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు.దేశ అభివృద్ధి, ప్రజాస్వామ్య బలోపేతంలో యువత కీలక పాత్ర పోషించాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. తెలంగాణ అభ్యుదయం – యువత మరియు రాజకీయాలు అనే అంశంపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఎంపీ వంశీకృష్ణ పాల్గొని యువత రాజకీయాలు, క్రీడా రంగాల్లో భాగస్వామ్యంపై తన అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి వచ్చి నాయకత్వ బాధ్యతలు చేపట్టేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.అదేవిధంగా క్రీడా రంగంలో యువతకు మెరుగైన అవకాశాలు కల్పించి, ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై దేశానికి మరిన్ని పతకాలు సాధించే స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని సూచించారు.పెద్దపల్లికి చెందిన యువ క్రీడాకారిణి నికిత స్వర్ణ పతకం సాధించడం, మిక్స్‌డ్ డబుల్స్ షూటింగ్‌లో భారత క్రీడాకారులు సాధించిన విజయాలు యువతలో ఉన్న ప్రతిభకు నిదర్శనమని ప్రస్తావించారు. యువతకు సరైన అవకాశాలు, ప్రోత్సాహం కల్పిస్తే రాజకీయాలు, క్రీడలు సహా అన్ని రంగాల్లో రాణించి దేశ నిర్మాణంలో మరింత కీలక భాగస్వాములు అవుతారని ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆకాంక్షించారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



-విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే పునాది
- రామగుండం ఏసీపీ రమేష్

చురకలు ప్రతినిధి మంథని, నవంబర్ 14 : మంథని పట్టణంలోని కాకతీయ హై స్కూల్ యాజమాన్యం బాలల దినోత్సవ వేడుకలను మంథని లోని మహాలక్ష్మి గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం ఏసీపీ మడత రమేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏసీపీ రమేష్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి జీవితంలో విద్య ఎంతో ముఖ్యమైనదని, విద్య ద్వారానే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారిని క్రమశిక్షణతో పెంచుతూ మంచి విద్యను అందించాలని సూచించారు. పిల్లలను కేవలం మార్కుల కే పరిమితం చేయకుండా, వారిలో నైతిక విలువలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సమాజం పట్ల బాధ్యత వంటి లక్షణాలను పెంపొందించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లల భవిష్యత్తు కోసం విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ, బాలలే దేశ భవిష్యత్తు అని, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నైతిక విలువలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులను సమాజానికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే పాఠశాల లక్ష్యమని పేర్కొన్నారు. పిల్లల అభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో కీలకమని తెలిపారు.అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ లు, మంథని మున్సిపల్ చైర్మన్ పోద్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముసుగుల సహేందర్ రెడ్డి, జె ఎన్ టి యు ప్రొఫెసర్ రవిబాబు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.